క్లుప్తంగా

కోసిగి రోడ్డును నిర్మించాలి



రోడ్డుపై ధర్నా చేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: శిథిలమైన కోసిగి రోడ్డును పునర్ నిర్మించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు సత్యన్న డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని కోసిగి రోడ్డుపై సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో వాహనదారులు, పలు గ్రామాల ప్రజలతో ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరు నుంచి కోసిగికి ఇదే రహదారిలో వుండే పలు గ్రామాలకు వందలాది వాహనాలు, ఆర్టీసీ బస్సుల రాకపోకలతో రద్దీగా వుంటుందన్నారు. అయితే ఈ రహదారి పూర్తిగా శిథిలమై ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం, ఆర్అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు బాలరాజు, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ ఉన్నట్లా.. లేనట్లా..?



మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

ఆదోని టౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను రద్దు చేయడమే ధ్యేయంగా పెట్టుకున్నట్లు కనిపిస్తుందని, రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ అమలులో ఉన్నట్లా లేనట్లా అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మరియు ఆదోని ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఎస్.గోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వచ్చాక వైద్యం చేయించుకునేందుకు పేద ప్రజలు కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్తే ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్సలు చేసేందుకు నిరాకరిస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్సలు చేస్తే మాకు డబ్బు రావడం లేదని, మేము ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందించలేమని సమాధానం చెబుతున్నారన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

అశోక్‌వర్మ మృతి తీరని లోటు



అశోక్‌వర్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి

మంత్రాలయం : వైఎస్సార్‌సీపీ యువ నేత అశోక్‌వర్మ మృతి తీరని లోటని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం వేకువ జామున పట్టణానికి చెందిన శ్రీవైష్ణవి విద్యాసంస్థల అధినేత సత్యరాజు కుమారుడు అశోక్‌వర్మ అనారోగ్యంతో మృతి చెందారు. అశోక్‌వర్మ వైఎస్సార్‌సీపీలో యాక్టివ్‌గా పనిచేసేవాడు. విషయం తెలుసుకున్న వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి హుటాహుటిన మంత్రాలయం వచ్చి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, టీటీడీ బోర్డు పాలకమండలి మాజీ సభ్యుడు వై.సీతారామిరెడ్డి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అశోక్‌వర్మ కుటుంబానికి ఎల్లవేళలా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమారెడ్డి, సర్పంచు తెల్లబండ్ల భీమయ్య, నాయకులు మల్లికార్జున, రవిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎస్జీటీలనే హెచ్‌ఎంలుగా నియమించాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షులు సి.నాగరాజు

ఆదోని సెంట్రల్: ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా సీనియర్ సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్జీటీ)లనే నియమించాలని ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షులు సి.నాగరాజు, ఎస్టీయూ రాష్ట్ర పురపాలక కన్వీనర్ జి.వీరచంద్రయాదవ్ డిమాండ్ చేశారు. డివిజన్ కేంద్రమైన ఆదోనిలోని ఎస్టీయూ భవన్‌లో పట్టణాధ్యక్షులు కె.రవి అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో హేతబద్ధీకరణలో మిగిలిపోతున్న స్కూల్ అసిస్టెంట్లను ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలుగా నియమించే ప్రక్రియను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. దీంతో సీనియర్ ఎస్జీటీలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఉన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులను ప్రాథమిక విద్యావ్యవస్థలోకి తీసుకురావొద్దని కోరారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి భీమరాజు, ఎస్టీయూ నాయకులు జంబులయ్య, రాజా, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో సాగు సందడి

- వ్యవసాయ పనుల్లో రైతన్నలు బిజీ
- వరుస వర్షాలతో మొదలైన వ్యవసాయ పనులు
- ఊపందుకున్న విత్తన పనులు
- పత్తిసాగుపై రైతన్నల ఆసక్తి



పత్తి విత్తనాలను నాటుతున్న వ్యవసాయ కూలీలు



గంగవరం పొలాల్లో గుంటక పాస్తున్న రైతు,



పూలచింతలో రోటర్‌వేటర్‌తో దుక్కిచేస్తున్న రైతన్న

నందవరం : వరుణుడు ముందుగానే కురుణించడంతో.. వ్యవసాయ పనుల్లో రైతన్నలు బిజీ బిజీగా గడుపుతున్నారు. పొలాల్లో రైతన్నలు, వ్యవసాయ కూలీల సందడి మొదలైంది. గత వారం రోజులుగా మండలంలో కురిస్తున్న వానలకు మండల పరిధిలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఆదివారం మధ్యాహ్నం నందవరం, గంగవరం, నదికైరవాడి, జోహారాపురం, పూలచింత, నాగలదిన్నె, పెద్దకొత్తిలి తదితర గ్రామాల్లో మోస్తారుగా వర్షం కురిసింది. వర్షాలతో వదర నీటితో తుంగభద్ర నది ఉధృతంగా ప్రవహిస్తోంది.

జోరుగా విత్తన పనులు

మండలంలో దాదాపు 42వేల ఎకరాలు సాగువిస్తీర్ణ కాగా.. ప్రస్తుతం నందవరం, పూలచింత, ముగతి, గంగవరం, జోహారాపురం, నాగలదిన్నె, నదికైరవాడి, హారిహర్వి తదితర గ్రామాల్లో విత్తన పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్‌కు ముందుస్తు వర్షాలు కురవడంతో సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే నది తీర గ్రామాలు, బోరు బావుల వద్ద సాగు పంటల సందడి మొదలైంది, అలాంటి పరిస్థితులో వర్షాలు కురుస్తుడడంతో పంటలకు అనుకూలంగా మారటంతో రైతులు విత్తనం విత్తులో బిజీ బిజీగా ఉన్నారు. మిరప రైతులకు కూటమి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించలేకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. దీంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో పత్తి పంట అన్నదాతలు మక్కువ చూపుతున్నారు.

అందని ప్రభుత్వ సాయం..

ప్రస్తుతం ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం అందించ లేదని ఆవేదన చెందుతున్నారు. ఇదే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం అందేదని, దీనికి తోడు సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు అందించేవారని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. విత్తు సమయానికి కూటమి ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలు, ఎరువులతో పాటు అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడిసాయం అందించాలని రైతులు కోరుతున్నారు.



చూడి గ్రామం వద్ద ఉల్లి నాట్లలో నిమగ్నయమైన కూలీలు

జోరుగా విత్తు పనులు

కౌతాళం: మండలంలో గత పది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రం కౌతాళంతో పాటు ఎరిగేరి, కామవరం, ఉరుకుంద, ఓబుళాపురం, సుళేకేరి, బంటకుంట, చూడి గ్రామాలతో పాటు మిగతా గ్రామాల్లో రైతన్నలు శని, ఆదివారల్లో విత్తు, నాట్లల్లో నిమగ్నమయ్యారు. మరికొంత మంది రైతన్నలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై విత్తుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే కొంత మంది రైతులు పత్తి విత్తనాలు విత్తారు. ప్రధానంగా పత్తి పంటను సాగు చేయడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. గతేడాది నుంచి మిరప పంటకు సరైన ధర లేకపోవడం, ఏసీల్లో స్టాక్ పెట్టుకున్నా గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులు మిరప పంటపై ఆసక్తి చూపడం లేదు. పత్తి పంటపైనే దృష్టి సారిస్తున్నారు. ఈసారి 70వేల ఎకరాల వరకు మండలంలో పత్తి పంట సాగు కావచ్చు అన్న అంచనలో వ్యవసాయశాఖ అధికారులు ఉన్నారు.

సాయన్నకు కృతజ్ఞతలు



మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి నాగరాజ్

ఆదోని టౌన్: ఎన్ని జన్మలెత్తినా సాయన్న (మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి) రుణం తీర్చుకోలేనిదని ఆదోని మున్సిపల్ చైర్‌పర్సన్ సి.హెచ్.లోకేశ్వరి నాగరాజ్ తెలిపారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి నివాసంలో ఆయనను ఘనంగా సన్మానించారు. లోకేశ్వరి, ఆమె భర్త నాగరాజు, వారి కుటుంబ సభ్యులు సాయన్నకు పూలమాలలు వేసి శాలువాలు కప్పి సత్కరించారు. ఆదోని నూతన చైర్‌పర్సన్‌గా తనను ఎంపిక చేసి, ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా సాయిప్రసాద్‌రెడ్డిని కృతజ్ఞతాభావంగా సన్మానించినట్లు వారు తెలిపారు. సాయన్న తమపై నమ్మకం ఉంచి ఆదోని మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పదవిని కట్టబెట్టారని, ఆయన నమ్మకాని వొమ్ము చేయకుండా ఆదోని అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు. పాలకవర్గ సభ్యుల విన్నపాలు, ఫిర్యాదులు, ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధివైపు తీసుకెళ్తానని లోకేశ్వరి తెలిపారు. ప్రధానంగా వేసవికాలం కావడంతో పట్టణంలో తాగునీటి సమస్య కొన్ని ప్రాంతాల్లో ఉందని, ఆ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

అభివృద్ధిపైనే దృష్టి సారించాలి

ప్రజా సమస్యల పరిష్కారం, ఆదోని అభివృద్ధిపైనే దృష్టి సారించాలని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సూచించారు. ప్రజా సమస్యలను పరిష్కరించినప్పుడే ప్రజల మన్ననలు పొందుతారని చైర్‌పర్సన్‌కు చెప్పారు. సమావేశంలో మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, చైర్‌పర్సన్ కుటుంబ సభ్యులతో పాటు సాయన్న అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యం.. మానవ మనుగడకు ప్రమాదం



పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న జీఆర్‌పీ పోలీసులు

ఆదోని సెంట్రల్: కలుషితమైన వాతావరణం మానవ మనుగడకు ప్రమాదకరమని ఆర్‌పీఎఫ్ ఎస్ఐ బి.మల్లేశ్వరయ్య తెలిపారు. పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ మనం నివసించే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మనుషులకు హానీ కలిగించే ప్లాస్టిక్ వస్తువులు వాడకూడదన్నారు. ప్రతి ఇంటి ముందు ఒక మొక్కను నాటడం వల్ల భవిష్యత్ తరాలకు మంచి ఆరోగ్యాన్ని అందించిన వారమవుతామన్నారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు, జీఆర్‌పీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే వాల్మీకుల అభ్యున్నతి



వాల్మీకి మహర్షి ప్రతిభా పురస్కారాలు పొందిన విద్యార్థులతో నిర్వాహకులు

ఎమ్మిగనూరుటౌన్: విద్యతోనే వాల్మీకి బోయలు అన్ని రంగాల్లో అభ్యున్నతిని సాధించగలరని వాల్మీకి బోయ ఉద్యోగుల సంఘ నాయకులు బాలవెంకటేశ్వర్లు, డాక్టర్ మల్లన్న, వెంకటరాఘవన్, మాధవి, నాగమణి అన్నారు. ఆదివారం పట్టణంలోని వాల్మీకి భవన్ ప్రాంగణంలో వాల్మీకి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జిల్లాలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు వాల్మీకి మహర్షి ప్రతిభా పురస్కారాలను అందించారు. సంఘ నాయకులు ఉసేని అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. వాల్మీకి విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతిభా పురస్కారాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. మొదటి, ద్వితీయ, తృతీయ పురస్కారాలను కావ్య, బోయ వరుణ్‌సందీప్, కౌశిక్ కుమార్‌లకు రూ.10వేలు, రూ.6వేలు, రూ.4వేల నగదుతో పాటు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో వాల్మీకి ఉద్యోగుల సంఘ నాయకులు నరసయ్య, ఆలూరు నాగరాజు, రఘునాథ్, వెంకటరెడ్డి, లక్ష్మీనారాయణ, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి చౌక దుకాణాల్లోనే రేషన్ సరుకులు

ఆదోని రూరల్: జూన్ 1వ తేదీ నుంచి ప్రజలకు ప్రభుత్వం అందించే రేషన్ సరుకులు చౌక ధర దుకాణాల్లోనే పంపిణీ చేస్తారని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ 65 సంవత్సరాలు పైబడిన వారికి మరియు విభిన్న ప్రతిభావంతులకు రేషన్ సరుకులు హోం డెలివరీ చేయడం జరుగుతుందన్నారు. అలాగే రేషన్ షాపులు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు తెరిచి ఉంటాయన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

28న వాహనాల వేలం

కోసిగి: కోసిగి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్ పరిధిలోని కోసిగి, పెద్దకడబూరు మండలాల పరిధిలో అక్రమ మద్యం రవాణా చేస్తూ పట్టుబడిన వాహనాలకు ఈనెల 28న జిల్లా ఎక్సైజ్ ప్రొహిబిషన్ అధికారుల ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ సీఐ భార్గవ్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వేలంలో ప్రభుత్వ నిర్ణయించిన ధరలకు అదనంగా పాడిన వారు వాహనాలు పొందవచ్చన్నారు. వేలంలో పాల్గొనే వారు నిర్ణయించిన ధరలో 10శాతం డిపాజిట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. వేలంలో పొందిన తరువాత ఆధార్ కార్డు, పాన్ కార్డు జిరాక్స్ కాపీలు అందించాల్సి ఉంటుందని తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ఈనెల 28న ఉదయం 10గంటలకు కోసిగి ఎక్సైజ్ స్టేషన్ వద్దకు చేరుకోవాలని సూచించారు.

వికసించిన మే పుష్పం

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్లకు చెందిన తలారి రాఘవేంద్ర నాయుడు ఇంట్లో మే పుష్పం వికసించింది. ప్రతి ఏడాది మే నెలలోనే పుష్పం వికసించింది ఆయన తెలిపారు. ఏడాదికి ఒక్కసారి మాత్రమే ఈ పుష్పం పూస్తుందని చెప్పారు. ఈ పుష్పం చూడానికి అందంగా ఉండటంతో కాలనీ వాసులు చూసేందుకు వరుసకట్టారు.



కూటమి పాలన తిరోగమనం



ఎండీయూ డ్రైవర్లతో కలిసి ప్రభుత్వ తీరుపై మాట్లాడుతున్న బుట్టా రేణుక

ఎమ్మిగనూరుటౌన్: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజల సౌకర్యార్థం ఇంటి వద్దకే రేషన్ పంపిణీ వ్యవస్థను ప్రవేశపెడితే.. కూటమి ప్రభుత్వం మాత్రం దానిని రద్దు చేసి తిరోగమన పాలన సాగిస్తోందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక అన్నారు. ఆదివారం పట్టణంలోని శిల్పా ఎస్టేట్‌లోని పార్టీ కార్యాలయ ఆవరణలో ఎండీఎం వాహన డ్రైవర్లు ఆమెకు తమ సమస్యను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రేషన్ బియ్యాన్ని లబ్ధిదారుల ఇంటివద్దకే అందించిన ఘనత గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదన్నారు. దేశంలోని ఏరాష్ట్రంలోనూ ఇలాంటి ప్రక్రియను ప్రారంభించలేదని చెప్పారు. రేషన్ బియ్యం అందించి మాజీ సీఎం వైఎస్ జగన్ ఆదర్శంగా నిలిచారని తెలిపారు. అలాంటి వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దు చేసి మళ్లీ రేషన్ షాపుల వద్ద క్యూకట్టే కష్టాలను తెచ్చిపెట్టిందన్నారు.

జగనన్న ఇమేజ్‌ను దెబ్బతీయాలని..

మాజీ సీఎం జగనన్న ఇమేజ్‌ను దెబ్బతీయాలనే కుట్రతో పేదల ఇళ్ల వద్దకు వచ్చే రేషన్ బియ్యం వాహనాల వ్యవస్థను రద్దు చేయడం కూటమి ప్రభుత్వ అవివేకానికి నిర్దయమని బుట్టా రేణుక అన్నారు. పేదలకు మంచి సేవలందే పథకాలు ప్రజలకు చేరువైతే జగనన్న గుర్తొస్తాడని తలచి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసే పథకాలు, వాటి పేర్లను రద్దు చేయడం శోచనీయమన్నారు. రేషన్ బియ్యం అందించే ఎండీయూ వాహన ఆపరేటర్ల కుటుంబాల ఆర్థిక పరిస్థితి, వారు కోల్పోయే ఉపాధి గురించి ఆలోచించకుండా అనాలోచితంగా వాహనాలను రద్దు చేయడంతో వారు రోడ్డున పడనున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే ఎండీయూ వాహన వ్యవస్థను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టా శివనీలకంఠ, బుట్టా ప్రతుల్, పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, నాయకులు కోటకొండ నరసింహులు, పల శ్రీనివాసరెడ్డి, మాబ్బాష తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ట



ధ్వజస్తంభాన్ని ప్రతిష్టిస్తున్న దృశ్యం.



మొక్కు తీర్చుకుంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడ జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గార్లదిన్నె గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం నూతన విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా జరిగింది. దేవాలయంలో మూడు రోజుల నుంచి ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. ఉదయం ఆశేష భక్తుల హర్షధ్వనాల మధ్య ఆంజనేయస్వామి విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమం జరిగింది. అనంతరం భక్తులు మొక్కులు తీర్చుకొని తీర్థప్రసాదాలు పొందారు. కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక

- విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక, నాయకులు బుట్టా శివనీలకంఠ, బుట్టా ప్రతుల్, జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రకోట జగన్ మోహన్‌రెడ్డి హాజరయ్యారు.

దరఖాస్తు చేసుకోండి

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఇంటర్మీడియెట్ ఫస్టియర్ ప్రీస్కూల్ టీచర్ ట్రైనింగ్ (ఒకేషనల్) కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ షబానా ఆజ్మీన్ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ పాఠశాలలో ఫస్ట్ ఇయర్‌లో 20 సీట్లు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన గ్రామీణ ప్రాంత విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఆసక్తికలిగిన విద్యార్థులు ఆఫ్‌లైన్‌లో పాఠశాలలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2025-2026 విద్యా సంవత్సరానికి 6 నుంచి 10వ తరగతి వరకు అన్ని సీట్లు భర్తీ అయ్యాయని తెలిపారు.

మలుపు.. ప్రమాదాలకు పిలుపు!

- ప్రమాదకరంగా రహదారి మలుపులు
- సూచికలు ఏర్పాటు చేయని వైనం
- నిత్యం ప్రమాదాలు



రాళ్లదొడ్డి గ్రామం వద్ద ఎటువంటి ప్రమాదసూచిక లేని మలుపు



ప్రమాదకరంగా మారిన కోటేకల్ మలుపు



ఎక్కువ ప్రమాదాలు ఎర్రకోట-రాళ్లదొడ్డి గ్రామాల మధ్య ఉన్న టర్నింగ్



మాసుమాన్‌దొడ్డి మలుపు దగ్గర ప్రమాద సూచికలు లేని దృశ్యం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కడిమెట్ల, కోటేకల్, ఎర్రకోట-రాళ్లదొడ్డి, మాచుమాన్‌దొడ్డి గ్రామ సమీపంలో ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఈ రహదారి మలుపుల దగ్గర ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించవు. దీంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి.

- ఎర్రకోట, రాళ్లదొడ్డి మలుపుల వద్ద ఇటీవల వారం వ్యవధిలో ఇద్దరు వ్యక్తులు, రెండు వృషభాలు చనిపోవడంతో పాటు పలువురికి గాయాలపాలయ్యారు.
- మాసుమాన్‌దొడ్డి సమీపంలోని మలుపు రహదారిపై పత్తికొండ, ఆగ్రహారం, కందనాతి, కడివెళ్ల, దేవనకొండ గ్రామాలకు ఆర్టీసీ బస్సులు వెళ్తుంటాయి. అలాగే ఇసుక ట్రాక్టర్లు ఎక్కువగా తిరుగుతుంటాయి. మలుపు వద్ద ఎటువంటి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.
- కోటేకల్, ఎర్రకోట, రాళ్లదొడ్డి, కడిమెట్లకు వెళ్లే రహదారి మలుపుల వద్ద ప్రమాదసూచికలు లేక ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి మలుపుల వద్ద ప్రమాద సూచికలు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డుపైనే మురుగు.. వ్యాపారాలు కరువు



బస్టాండ్ ఎదురుగా ప్రధాన రహదారిపై పారుతున్న మురుగునీరు



మురుగునీటి వాసనతో వ్యాపారాలు లేక వెలవెలబోతున్న దుకాణాలు

మంత్రాలయం : పవిత్ర పుణ్యక్షేత్రం. నిత్యం వేలాది మంది భక్తులతో కళకళలాడే ఆధ్యాత్మిక కేంద్రం. అయితే ఇక్కడి డ్రైనేజీ వ్యవస్థను చూసి భక్తుల నుంచి ఛీదరించుకుంటున్నారు. ముక్కుపుటలు అదిరే మురుగు రోడ్డెక్కి పారడంతో భక్తులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇది ఒక్కరోజు సమస్య కాదు. కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి. బస్టాండ్ ఎదురుగా జాతీయ ప్రధాన రహదారి డ్రైనేజీ సమస్య తలనొప్పిగా మారింది. లాడ్జీల నుంచి వెలువడే మురుగునీరు డ్రైనేజీల నుంచి రోడ్లపైకి వస్తోంది. స్థానిక పరిమళ లాడ్జి వద్ద నుంచి 40 మీటర్ల పొడవునా మురుగు నీరు కాలువ నుంచి బయటకు వస్తోంది. కంపు వాసన వస్తుండటంతో భక్తులు అసహించుకుంటున్నారు. అటుగా ఉన్న వ్యాపార దుకాణాల యజమానులు వ్యాపారాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. అయినా ఇక్కడి అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడటంలేదు. ఇలాంటి సమస్యలతో పుణ్యక్షేత్రం పేరుకు చెడ్డపేరు వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.